
కానాయపల్లిలో రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి


పామిరెడ్డిపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న గ్రామస్తులు


ఖిల్లాఘనపురంలో..


అమరచింతలో..

ముగిసిన ఎన్నికల సంబురం

ఆత్మకూర్: మండలంలో మొత్తం ఓటర్లు 31,011 ఉండగా మహిళలు 15,672, పురుషులు 15,338, ఇతరులు ఇద్దరు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 72.73 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ ఆత్మకూర్‌లో పర్యటించి ఓటింగ్ సరళి పరిశీలించారు.

35 పోలింగ్ కేంద్రాలు

మండలంలో 35 పోలింగ్ కేంద్రాలకు గాను ఆరుగురు సెక్టోరియల్ అధికారులు, కేంద్రానికి ఐదుగురు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించగా.. ఆత్మకూర్, రేచింతల, ఆరేపల్లి, పిన్నంచర్ల గ్రామాల్లోని 15 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించి పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ శివకుమార్, తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్, కమిషనర్ నాగరాజు, సెక్టోరియల్ అధికారులు ఎన్నికల తీరును పరిశీలించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

జూరాలలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గీయుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒక వర్గం వారు వేటకొడవళ్లతో దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లోనే ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో ఎస్‌ఐ నరేందర్ వారిని శాంతింపజేశారు.

అమరచింత: మండలం మొత్తంలో 22,946 ఓట్లు ఉండగా.. 17,170 ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు. మహిళలు 8,585 మంది ఓటు హక్కును వినియోగించుకోగా పురుషులు 8,585 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్ల కొరతతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు. టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ తన ఓటు హక్కును అమరచింతలో వినియోగించుకున్నారు. ఏఎస్పీ రాందాస్ తేజావత్ అమరచింత, నందిమళ్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎస్‌ఐ సురేష్‌కుమార్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పాన్‌గల్: మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 44 పోలింగ్ బూత్‌ల్లో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలవ్యాప్తంగా 64.97 శాతం ఓటింగ్ జరిగినట్లు మండల ఎన్నికల అధికారి సుభాష్‌నాయుడు తెలిపారు. మండలంలో మొత్తం 40,616 ఓట్లకు గాను 26,390 ఓట్లు పోలైనట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 79.13 శాతం ఓట్లు పోలవగా.. పార్లమెంటు ఎన్నికలలో ఓటింగ్ శాతం తగ్గింది.

మదనాపురం: మండలవ్యాప్తంగా మొత్తం 30 కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమయింది. దుప్పల్లి, కొన్నూరు, నర్సింగాపురం, అజ్జకొల్లు, రామన్‌పాడు, తిరుమలయ్యపల్లి, దంతనూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. మొత్తం మండలంలోని 23,050 ఓట్లకు గాను 16,995 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 29 పోలింగ్ కేంద్రాల్లో 23,938 ఓటర్లు ఉండగా 15,664 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్తకోట రూరల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని 22 గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, ఎన్నికల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటింగ్ సమయం పూర్తయ్యే వరకు 71.55శాతం ఓటింగ్ నమోదయినట్లు అధికారులు తెలిపారు.

పెబ్బేరు రూరల్: పెబ్బేరు మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన 45 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. శ్రీరంగాపురం మండలంలోని 17 పోలింగ్ కేంద్రాల్లో 65 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

చిన్నంబావి: మండల వ్యాప్తంగా 68.29 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలో పెద్దదగడ, కొప్పునూరు, పెద్దమారు ఓటింగ్ శాతం మెరుగ్గా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది.

గోపాల్‌పేట: మండలంలో 67.76 శాతం ఓట్లు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. తిర్మలాపూర్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నాడు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓఆర్‌ఎస్, ప్రథమ చికిత్సకు సంబంధించిన సామగ్రి, తాగునీరు, వీల్ చైర్ అందుబాటులో ఉంచారు.

ప్రశాంతంగా ముగిసిన పార్లమెంటు ఎన్నికలు

ఖిల్లాఘనపురం: మండలంలో 68 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎస్పీ రక్షిత కె మూర్తి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి మండలంలోని సోళీపురం తదితర గ్రామాల్లో పర్యటించి ఎన్నికల సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల అధికారులకు, ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.


అమరచింతలో..


కొన్నూరులో..


అమరచింతలో కేశం నాగరాజ్ గౌడ్


పిన్నంచర్లలో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన మహిళలు


పాన్‌గల్ పోలింగ్ కేంద్రం వద్ద..


అప్పరాలలో..


జూరాల పోలింగ్‌కేంద్రం వద్ద


నర్సింగాపురంలో..


బుసిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


సూగూరులో..


ఆత్మకూర్‌లో..


పారికిపాడులో..


వనపర్తిలో కుటుంబ సమేతంగా ఓటుహక్కు వినియోగించుకున్న మద్రాస్ హైకోర్టు జడ్జి డి.నాగార్జున


తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న అంజుశ్రీ


ఆత్మకూర్‌లో..


దుప్పల్లిలో..

క్లుప్తంగా

హజ్ యాత్రికులకు సన్మానం



ఆత్మకూర్: ముస్లింల అత్యంత పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. సోమవారం రాత్రి స్థానిక జియాఉల్‌ఖురాన్ మదర్సాలో హజ్ యాత్రకు వెళ్తున్న అఫ్తాబ్, అజ్హర్‌లను కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా హాఫీజ్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హజ్ యాత్రికులు మక్కా, మదీనాలో ప్రపంచశాంతి కోసం ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూసూఫ్‌సాబ్, నవీద్, మోసీన్ వహాబ్, అఫ్తాబ్, అజ్హర్ తదితరులు ఉన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాల విద్యార్థులు సీబీఎస్‌ఈ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన రాహుల్ కుమార్‌రెడ్డి 483 మార్కులు సాధించి అత్యధిక ప్రతిభను కనబర్చారు. దీపికారెడ్డి 476, హన్సిత 472, సంతోష్ 467, చందన 463 మార్కులు సాధించారు. అధిక ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం 7గంటల వరకు జల్లులు కురిశాయి. ఎండ వేడిమితో తల్లడిల్లిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఊరట నిచ్చింది. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది వర్షం కారణంగా ఇబ్బంది పడ్డారు. ఓటర్లు కూడా వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. బోయలగూడెం, ఇందువాసి, చాగదోణ ప్రాంతాల్లో కాస్త ఎక్కువగానే వర్షం కురిసింది. ఈ వానకు బోయలగూడెం-చిన్నోనిపల్లె గ్రామాల మధ్యన ఉన్న వాగులు పొంగిపొర్లాయి. వేసవి దుక్కులు దున్నేందుకు రైతులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడనుంది.


బోయలగూడెం-చిన్నోనిపల్లె గ్రామాల మధ్య నీరు పారుతున్న వాగు

రోడ్లపై ధాన్యం..ప్రయాణికుల అవస్థలు

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో మంత్రాలమ్మ ఆలయం వద్ద బావాయిపల్లి ప్రధాన రోడ్లపై వరి ధాన్యం, మొక్కజొన్న పంటలను రైతులు బీటీ రోడ్డుపై ఆరబెట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో రైతులు ధాన్యం కుప్పలుగా పోసి కవర్లు కప్పడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి ఇద్దరు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టాలంటున్నారు.


జనుంపల్లి మంత్రాలమ్మ దగ్గర రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

ఇరువర్గాల ఘర్షణ

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనలో సోమవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పాత కక్షలతో నరేష్, శేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు గొడవపడ్డారు. ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రి హోమం



మల్దకల్: మండలంలో మల్దకల్ వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారి గాయత్రిహోమం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

హైఓల్టేజీతో కాలిన ఎలక్ట్రానిక్ వస్తువులు

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో సోమవారం తెల్లవారు జామున హై ఓల్టేజీ కరెంట్ రావడంతో టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు, బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయావని బాధితులు వాపోయారు. దాదాపుగా 40 మంది ఇళ్లలో వస్తు సామగ్రి కాలిపోయావని తెలిపారు.

పుర కౌన్సిలర్ మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చిన్నారెడ్డి, మేఘారెడ్డి

వనపర్తి టౌన్: స్థానిక పురపాలిక 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణ ఆదివారం రాత్రి మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరఫున గెలుపొంది ఫ్లోర్‌లీడర్‌గా కొనసాగారు. కౌన్సిలర్ మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి వేర్వేరుగా సోమవారం పట్టణంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్నారెడ్డి అంతిమయాత్రలో పాల్గొనగా.. ఎమ్మెల్యే మేఘారెడ్డి పాడేమోశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, డీసీసీ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ బి.వెంకటేష్, నాయకులు లక్కాకుల సతీష్, కదిరె రాములు, చెన్నరాములు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.



సెల్ఫీ జోరు.. ఓటరు హుషారు

అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓటు వినియోగంపై వినూత్న ప్రచారం నిర్వహించింది. ఓటు వేసిన అనంతరం సిరా రాసిన చూపుడు వేలితో ఓటు వేయని వాళ్లకు చూపుతూ క్రేజ్ పుట్టించారు. దీంతో ఓటు వేయని యువత సోషల్ మీడియాలో పోస్టులను చూసి పోలింగ్ కేంద్రాల బాటపట్టారు. పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. వేసవి అయినప్పటికీ వాతావరణం చల్లబడటంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. కేంద్రాల వద్ద రద్దీ తగ్గుతున్న క్రమంలో సోషల్‌మీడియా పుణ్యమా యువతలో కొంత క్రేజ్ వచ్చింది. యువత తమ తమ సోషల్‌మీడియా గ్రూపుల్లో ఓటు వేసి వచ్చిన అనంతరం సీరా వేసిన చూపుడు వేలును చూపుతూ ఫొటోలను పోస్టు చేశారు. దీంతో ఒక్కొక్కరుగా ఓటు వేసి వచ్చి సిరాతో ఉన్న చూపుడు వేలు పెట్టి తమ ఫొటోలు పోస్టు చేశారు. ఈ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు సైతం ఓటు వేసిన అనంతరం తమ తమ అనుచర గణంతో ఫొటోలు దిగుతూ చూపుడు వేలు చూపుతూ పోస్టులు పెట్టారు. ఉదయం నుంచి ఏ గ్రూప్‌లో చూసినా ఇలాంటి ఫొటోలే అధికంగా కనిపించాయి. ఇంకొంత మంది ఓటు యొక్క ప్రాముఖ్యతను, విలువనూ వివరిస్తూ పలు సందేశాల పోస్టులతో ఓటర్లు పోలింగ్ బాట పట్టడానికి కృషి చేశారు. యువత ఉదయమే ఇలాంటి ఫొటోలతో ఇతరులు పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లడానికి జోష్ పెంచారు. జట్లు జట్లుగా ఓటు వేసి ఫొటోలను పోస్టు చేస్తుండటంతో ఇతరులు సైతం ఓటు వేయడానికి కొంత వరకు దోహదపడింది. ఎమ్మెల్యే విజయుడు తన స్వగ్రామమైన పుల్లూరులో ఓటు వేసి తన మిత్ర బృందంతో దిగిన ఫొటోలు షేర్ చేశారు. ఏది ఏమైన యువత సందేశంతో కొంత పోలింగ్ శాతం పెరగడానికి ఈ పోస్టులు తోడ్పాటును అందించాయని చెప్పవచ్చు.


మిత్ర బృందంతో కలిసి సిరా చుక్క ఉన్న చూపుడు వేలు చూపుతున్న ఎమ్మెల్యే విజయుడు